

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు.. కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు, కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు.. వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బడ్జెట్ పద్మనాభం

**"సుమా! కూరలు కొనడానికి వస్తావా?"** ఆఫీస్ నుంచి రాగానే అడిగాడు కామేష్.

"కొత్త పెళ్ళికూతుర్ని ఎవరైనా సినిమాలకి, షికార్లకి తీసుకెళ్తారు. ఇతనేమిటి కూరగాయలంటాడు?" అయోమయంగా తలాడించింది సుమ.

షాపులోకి వెళ్ళగానే నవనవలాడుతూ కనిపించిన కాప్సికమ్ వైపు పరిగెత్తి చెప్పింది.

"నాకు కేప్సికమ్ మసాలా కర్రీ అంటే చాలా ఇష్టం."

"అమ్మో! కేజీ ఎనభైరూపాయలు. అంటే పావు ఇరవై. ఈ గోరు చిక్కుడు కాయలు చూడు, కేజీ ఇరవై. అంటే పావు ఐదు రూపాయలే ఇవి కొందాం. ఫుల్ ఆఫ్ బి విటమిన్." వాటివైపు నడిచాడు కామేష్.

"పుల్లల్లాగా గొంతులో గుచ్చుకుంటూ అవేం బావుంటాయండీ." నసుగుతూ అతని వెనకే నడిచింది.

కామేష్ చకచక కూరల వంక కాకుండా ధరల వంక చూస్తూ అతి చవకైన కూరగాయలు కొని, కేరీబేగ్‌కి రెండు రూపాయలు అదనంగా ఇవ్వాలి కాబట్టి ఇంటినుంచి తెచ్చిన అరవ అక్షరాలున్న కాఫీపొడి అడ్వర్‌టైజ్‌మెంట్ సంచిలో వాటిని నింపి విజయగర్వంగా బయటకి నడిచాడు.

అతగాడి పొదుపు చూసి నిర్ఘాంతపోయి అనుసరించింది సుమ.

"ఇంకేమైనా కొనాల్సినవి ఉన్నాయా?" కారెక్కాక ఉదారంగా అడిగాడు కామేష్.

"అదే గరం మసాలా సామగ్రి. దాల్చిన చెక్క, లవంగాలు.."

"..అసలు కొంచెం నూనెలో కనీకనపడనట్లు కొద్దిగా పోపు వేసి కూరలు వండితే సుమా, రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం. ఇంకా ఏమైనా కావాలా?"

"లేదు. వద్దు." ముభావంగా చెప్పింది.

"మనం ఈ వేసవిని భరిస్తున్నందుకు దేవుడు మనకి ఇచ్చిన రెండు అద్భుతమైన బహుమతులు ఏంటో తెలుసా కామేష్?" ప్రశ్నించింది సుమ.

"ఆవకాయ"

"ఛీ! ఎప్పుడూ తిండిగోలే"

"మరి? విసనక్కర?"

అతని పరిధి అక్కడితో ఆగిపోయిందని అర్థమైన సుమ చెప్పింది.

"మల్లెపూలు, మామిడిపళ్ళు"

ఆఫీస్ నుంచి వచ్చినప్పటినుంచి ఇంట్లో సువాసన ఏమిటా అని ఆలోచిస్తున్న కామేష్‌కి అది మల్లెపూల వాసన అని అప్పటికి తట్టింది.

మల్లెపూలమాలని దోసిట్లోకి తీసుకుని గాఢంగా ఆఘ్రాణించి మత్తుగా చెప్పింది సుమ.

"వీటికోసం ఎంత వేడినైనా భరించవచ్చు. మీరూ చూడండి. ఎంతటి సుగంధమో."

చేతులని అతని ముఖానికి దగ్గరగా తీసుకెళ్ళింది.

"నీకొక్కదానికీ ఇన్ని కొన్నావేంటి? అసలు ఒక్క పువ్వుచాలు. ఎంతవాసనో" ఆమె చేతులని దూరంగా నెట్టేస్తూ అయిష్టంగా చెప్పాడు.

అతని వంక విచిత్రంగా చూసింది సుమ. కామేష్ దృష్టి టేబుల్ మీది మామిడి పళ్ళ బుట్ట పడింది.

"కిలో ఎంతకి కొన్నావు?" వాటిని చూపిస్తూ అడిగాడు.

"ఇప్పుడిప్పుడే వస్తున్నాయ్‌కదా. అరవైరూపాయలు. మూడుకిలోలు తీసుకున్నాను."

"ఆ!" గుండెల మీద చేతులు వేసుకుని ఆశ్చర్యంగా అడిగాడు కామేష్.

"నూటఎనభై రూపాయలు మామిడిపళ్ళకి, ఆ పూలో ఇరవై అయి ఉంటాయి. అంటే ఒక్కరోజులో రెండువందలు ఖర్చుపెట్టావా?"

"చలికాలం నాలుగువందలు పెట్టినా అవి దొరుకుతాయా?" ఉక్రోషంగా అడిగింది సుమ.

"ఐతే మాత్రం అవి తినకపోతే చచ్చిపోం కదా? కాస్త విచక్షణతో ఖర్చుపెట్టాలి." చిరాగ్గా అరిచాడు కామేష్.

చేతిలోని మల్లెమాలని బాల్కనీలోంచి కిందకి విసిరేసి విసురుగా వెళ్ళిపోయింది సుమ.

"ఈ చీర ఎలా ఉంది?" కామేష్‌ని అడిగింది సుమ.

"బావుంది. ఐనా మన పెళ్ళిలో నీకు బోలెడు చీరలు కొన్నారుగా. మళ్ళీ ఇప్పుడు ఎందుకు కొన్నావు?"

"ఈ నెల పదిహేనున నా పుట్టినరోజు కదా? అందుకని కొనుక్కున్నాను."

"ఎంత?" అనుమానంగా అడిగాడు కామేష్.

"ఐదువేలు."

"ఐదువేలా?" కీచుగా అరిచాడు కామేష్.

"ప్రతీదానికి ఎందుకలా కెవ్వుకెవ్వున అరుస్తారు? ఆ మాత్రం లేకపోతే చీరలు రావడంలేదు." అసహనంగా చెప్పింది.

"నువ్వు మరీ దుబారా మనిషివి సుమా. పెళ్ళికి వచ్చిన చీరల్లో ఒకటి దాచుకుని ఉండాల్సింది. ఐదువేలంటే నా మూడురోజుల సంపాదన తెలుసా? మూడురోజులు నేను ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరుదాకా కష్టపడి సంపాదించిన మొత్తాన్ని ఒక్క చీరతో ఖర్చుపెట్టేసావ్" చిరాగ్గా చెప్పాడు.

"మరి సంపాదించేది ఎందుకు? మీకు పెద్ద జీతమనేగా మా వాళ్ళు పెళ్ళి చేసింది. ఎన్ని ఆశలతో కాపురానికి వచ్చానో. వచ్చిన రోజునుంచి లెక్కలు. ఖర్చులు. ఆదాలు. మీ బుర్రలో సదా ఓ కేలిక్యులేటర్ పనిచేస్తూంటుంది. ఇంత హీనంగా మన పనిమనిషి కూడా బతకదు తెలుసా?"

"సంపాదిస్తే తెలిసేది ఖర్చుపెట్టడానికి పడే బాధ."

"మరి సంపాదించే అమ్మాయిని కాకుండా నన్నెందుకు చేసుకున్నారు?"

"అసలు మా నాన్నని అనాలి." పళ్ళు పటపటాకొరికాడు కామేష్

"నాకు తెలుసు. మీ నాన్నకి జాతకాల పిచ్చి. మీ ప్రవర్తనలాగానే మీ జాతకం కూడా చాలా వెరైటీగా ఉందిట. మీరు 'ఉద్యోగం చేసే అమ్మాయి' అని మోజుపడిన వాళ్ళ జాతకాలు పాపం మీ విలక్షణ జాతకానికి కుదరలేదుట. నా ఖర్మకాలి నా జాతకం సూట్ అయిందని మీ నాన్న ఈ సంబంధం ఖాయంచేసారు. తమరు తండ్రి దగ్గర పిల్లి కాబట్టి అయిష్టంగా నా మెళ్ళో తాళికట్టారు."

"ఇవన్నీ నీకెవరు చెప్పారు? మా వదినేనా?"

"అవును. ఏం అబద్ధమా?"

"ఓసారి, 'ఆఫీస్ నుంచి వచ్చేప్పుడు ఫలానా సినిమా టిక్కెట్లు రెండు తీసుకురా కామేష్ మీ అన్నయ్యకి కుదరదు.' అని చెప్పింది. టిక్కెట్లకి మూడువందలు ఇవ్వమన్నాను. 'తమ్ముడివి. అన్నా వదినలకి ఆ మాత్రం సినిమా టికెట్లు కొనలేవా?' అంది. టిక్కెట్‌కి నూటఏభై పెట్టి నా పెళ్ళాన్ని కూడా తీసుకెళ్ళను అని చెప్పాను. దాంతో నా మీద కక్ష కట్టి దుష్ప్రచారం చేస్తోంది. ఇంకా ఏం చెప్పింది?"

"మీ అంత పిసినారి వాళ్ళని ఈ జనరేషన్‌లో చూడలేదుట. ఎప్పుడో బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో చూసిందిట. ***ఇంకా మీ పేరు కామేశ్వరరావు అయితే రీఫిల్ త్వరగా ఐపోయిందని కామేష్‌గా మార్చుకున్నారుట. నాపేరు సుమ. సింపుల్‌గా వత్తులు, దీర్ఘాలు సున్నాలు లేకుండా పలకడానికి ఈజీగా, ఓకల్ కార్డ్స్‌ని పెద్దగా వాడకుండా పిలవచ్చని పెళ్ళికి ఒప్పుకున్నారట."***

"హూ! గట్టిగా హుంకరించాడు!" కామేష్

"ఇంకా?"

"అమ్మాయి కనీసం బి.ఎడ్ చదివినా బావుండేది. టీచర్ జాబ్ అయినా చేసేది అని నసిగారట. మీనాన్న 'కాళ్ళూ చేతులు కట్టేసి పెళ్ళిచేస్తానంటే' ఇక తప్పక ఒప్పుకున్నారుట. ఐనా నెలకి ఏభైవేలు సంపాదించేవారు ఎంతమంది ఉంటారండీ? మీరు ఖర్చుచేయడానికి ఎందుకింత భయపడుతున్నారు? బేంక్ మేనేజర్‌గా మా నాన్న సంపాదించే దాంతో మేం నలుగురం ఎంత హేపీగా బ్రతికామో తెలుసా? ఈ లెక్కలు, కేలిక్యులేషన్స్ మాకు అసలు తెలీదు. ఐనా పుట్టినరోజుకి ఐదువేలతో ఒక చీర కొంటే ఇంత గొడవా?"

దాంతో మళ్ళీ అది గుర్తొచ్చి కామేష్ మొహం కోపంతో ఎర్రబడింది.

"అసలు నీకు డెబిట్ కార్డ్ ఇవ్వడం నాదీ బుద్ధి తక్కువ. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని ఇస్తే, ఇట్లా తగలబెడుతున్నావు." అరిచాడు.

ఐదునిమిషాల తర్వాత చీర పేకెట్, బిల్లు, డెబిట్ కార్డ్ తెచ్చి అతనికి ఇచ్చి చెప్పింది సుమ.

"అదిగో బిల్లు. వెళ్ళినచ్చలేదని వెనక్కి వచ్చెయ్యండి. మీ కార్డ్ మీరే ఉంచుకోండి. నాకు ఎప్పుడూ ఏ అవసరం రాదు."

నిర్మొహమాటంగా వాటిని తీసుకున్నాడు కామేష్

తలుపు తీసుకుని లోపలికి వచ్చిన కామేష్ చురుకైన ముక్కు గాలిలోని సుగంధాన్ని గుర్తుపట్టింది. మల్లెపూలవాసన!

సోఫాలో కూర్చుని టీ.వి చూస్తున్న సుమ తలనిండా పూదండ.

వెంటనే కామేష్‌కి కలిగిన ఆలోచన కనీసం ఏభైరూపాయలై ఉంటుంది. రెండో ఆలోచన, అంత డబ్బెక్కడిది? పుట్టింటి నుంచి తెప్పించుకుందా?

అతన్ని చూసి రిమోట్ అతనికిచ్చి భోజనానికి ఏర్పాట్లు చేసింది సుమ. పెళ్ళయిన ఏడాదిలో వారిద్దరి మధ్య పెద్దగా చనువు ఏర్పడలేదు. అతని పిసినారితనానికి విసిగిపోయి సుమ, సరసంగా మాట్లాడితే డబ్బు ఖర్చుపెట్టిస్తుందేమో ఆ అలుసుతో అని కామేష్ అపరిచితుల్లా మసలుకుంటున్నారు.

టేబుల్ మీది ఫ్రూట్ బౌల్ నిండా మామిడిపళ్ళు. పచ్చగా బంగారుముద్దల్లా కనిపించి కామేష్‌కి వాటిని తినాలనిపించింది. కానీ బింకంగా ఆ వైపు చూడకుండా అన్నం వడ్డించుకున్నాడు. తనూ ప్లేట్ తెచ్చుకుని వడ్డించుకుంది సుమ.

టి.వి చూస్తూ పండు దొండకాయ కూరని తింటున్న కామేష్‌కి గుప్పున మసాలా వాసన వచ్చింది. తను తెచ్చుకున్న బౌల్‌లోంచి కాప్సికమ్ మసాలా కూరని వడ్డించుకుంటోంది సుమ. తాపీగా దాన్ని అన్నంలో కలుపుకుని ఆస్వాదిస్తూ తినసాగింది. చవక అని కొని తెచ్చిన పండు దొండకాయ కూర పుల్లగా ఉండటంతో తినడానికి కష్టపడుతున్న కామేష్ సుమ వైపు ఆశగా చూసాడు. ఆమె మాత్రం అతని వైపు చూడకుండా తినేసింది. టేబుల్ సర్దాక ఓ ప్లేట్‌లో మామిడిపండు ముక్కలు తెచ్చుకున్న సుమ భర్త పక్కన కూర్చుని టి.వి చూస్తూ తింటూంటే ఇక ఆగలేక అడిగాడు కామేష్.

"సుమా! మల్లెపూలు కొనుక్కున్నావా?"

"అవును" ముక్తసరిగా చెప్పింది.

"మామిడిపళ్ళు?"

"కొన్నాను. ఎవరూ ఫ్రీగా ఇవ్వలేదు."

"కేప్సికమ్? మసాలా దినుసులు?"

"అన్నీ నేనే కొన్నాను. మీ డెబిట్ కార్డ్ భద్రంగా ఉందో లేదో చూడండి."

"ఎలా కొన్నావు? మీ నాన్న డబ్బు పంపారా?"

"ఛీ! ఏభైవేల జీతగాడి పెళ్ళాన్ని పాతికవేల పెన్షన్ వచ్చే ఆయన్ని డబ్బడుగుతానా?"

"జీతగాడేంటి అసహ్యంగా?" ఉడుక్కున్నాడు కామేష్.

"తప్పే! జీతగాడు ఎంచక్కా సాయంత్రం కూలి డబ్బులతో చికెన్, ఫిష్, గరంమసాలా, మల్లెపూలు అన్నీ కొనుక్కెళ్తాడు. రేపు గురించి వాడికి బెంగుండదు. ఎందుకంటే వాడిమీద వాడికి నమ్మకం ఉంటుంది."

వ్యంగ్యంగా చెప్పింది సుమ.

"అది సరేకానీ ఇవన్నీ ఎలాకొన్నావో చెప్పవా?" బ్రతిమాలాడు కామేష్.

"బి.ఎడ్ చదివినా బావుండేది టీచర్ జాబ్ చేసేది అన్నారుగా? మన ఫ్లాట్స్‌లో పిల్లలకి మేథ్స్, ఫిజిక్స్ ట్యూషన్ చెపుతున్నాను. ఈరోజు జీతం వచ్చింది. నాకు ఇష్టమైనవి కొనుక్కున్నా అంతే."

"ట్యూషన్ చెపుతున్నావా? ఎంత జీతం వస్తోంది? " ఆశగా అడిగాడు కామేష్.

"మల్లెపూలు, మామిడిపళ్ళు కొనుక్కునేంత" విసురుగా లేచి వెళ్ళిపోయింది సుమ.

**(వచ్చే సంచికలో మరో సరిగమ)**

Click here to share your comments on this story